ప్రజాపాలనతో ప్రజల బేజారు

- గ్యారెంటీ అందక చిర్రెత్తిన కాంగ్రెస్ కార్యకర్త
- ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందని ఆవేదన

బండ్లగూడ, జూలై 4: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్పి ప్రజల చేత ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలనతో ప్రజలను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు తమకు ఓటు వేసి గెలిపిస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గొప్పలు చెప్పి ప్రజలను మోసం చేసిందని పలువురు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు హామీలను అమలు చేస్తామని చెప్పి ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారెంటీల కోసం అప్లై చేసుకోవాలని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం అందరికీ తెలిసిందే. హంగు ఆర్భాటంతో ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించారని లబ్ధిదారులు పేర్కొన్నారు. అంతేగాకుండా గ్రామాలతో పాటు మున్సిపల్, వార్డు కార్యాలయాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. తదనంతరం లోక్‌సభ ఎన్నికలు రావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో కొంత కాలం పథకాల అమలును వాయిదా వేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని ప్రజలందరూ అంటున్నారు. కానీ తమకు ఇక నుంచి ఆరు గ్యారెంటీ పథకాలు అమలవుతాయా లేదా అనే సందేహాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఇదిలా ఉండగా దరఖాస్తులు చేసుకున్నవారిలో కొందరికే పథకం అమలవుతుండగా చాలా మంది లబ్ధిదారులకు పథకాలు అమలు కాకపోవడంతో నిరాశే ఎదురవుతున్నది.

మళ్లీ దరఖాస్తులు ఎందుకు చేయాలె..

ఎన్నికల తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మళ్లీ కొత్తగా దరఖాస్తుల కోసం ప్రజాపాలనను పునఃప్రారంభించారు. అయితే ఇక్కడికి వచ్చిన వారు తాము ముందుగానే దరఖాస్తు చేసుకున్నామని తమకు ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అందడం లేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే మీరు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా అక్కడి సిబ్బంది సూచిస్తునట్టు ప్రజలు తెలిపారు. గండిపేట మండలం పరిధిలోని కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మన్నె మోహన్ గతంలో తాను ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్నానని, రశీదు కూడా అందజేశారని తెలిపారు. మళ్లీ దరఖాస్తు ఎందుకు అడుగుతున్నారో అర్థం కావడం లేదని ఆయన వాపోయారు.

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న గుర్తింపు పత్రాన్ని చూపుతున్న మోహన్

గృహజ్యోతి రాలేదని అడిగితే..

తనకు ఎందుకు గృహజ్యోతి పథకం (జీరో బిల్) రాలేదని విద్యుత్ అధికారులను అడుగగా రేషన్ కార్డు తీసుకొని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలంలో ప్రజాపాలనలో సంప్రదించాలని సూచించారు. దీంతో మోహన్ తన విద్యుత్ బిల్లుతో పాటు, రేషన్‌కార్డును తీసుకుని ప్రజా పాలనలో సంప్రదిస్తే వారు మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారని పేర్కొన్నారు. కాగా నేను గతంలోనే దరఖాస్తు చేసుకున్నాని మరల ఎందుకు అని ప్రశ్నించాగా మీరు అధికారులను సంప్రదించాలని అక్కడి సిబ్బంది తెలిపారని వాపోయారు. దీంతో అతను విసిగిపోయి ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను కాంగ్రెస్ కార్యకర్త అయినప్పటికీ తనకు జరిగిన అన్యాయం ఇతరులకు జరుగవద్దన్నారు. ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో సమయం వృధా చేయడం తగదన్నారు.

6న అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ

హిమాయత్‌నగర్, జూలై 4: నారాయణగూడలోని బాబుజగ్జీవన్‌రాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న 17 అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ కోసం ఈనెల 6న ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగే ఇంటర్వ్యూకు అర్హులైన పోస్టు గ్రాడ్యుయేట్ అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. ఇంగ్లిష్-1, సంస్కృతం-1, అరబిక్-1, స్టాటిస్టిక్స్1, మ్యాథ్స్-1, అప్లైడ్ న్యూట్రిషన్-1, పొలిటికల్‌సైన్స్-1 హిస్టరీ-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, ఎకనామిక్స్-1, బిజినెస్ అడ్మినిస్ట్రేష న్-3, కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్-4 ఖాళీలు ఉన్నాయి. పీజీ, నెట్, సెట్, నీట్, పీహెచ్‌డీ వంటి అదనపు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని, బోధనా అనుభవం బట్టి తగు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు.

19 నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

హిమాయత్‌నగర్, జూలై 4: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ వైఎంసీఏ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రిస్టిలీ గైస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ వార్షిక వైఎంసీఏ ఫెస్టివల్‌లో భాగంగా లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో-ఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, బాక్స్ క్రికెట్, త్రోబాల్ వంటి పోటీలు ఉంటాయని చెప్పారు. ఈనెల 16లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. హైస్కూల్ స్థాయి విద్యార్థులు పాల్గొన వచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 77996 65544, 70326 60614లో సంప్రదించాలని కోరారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ

6వ వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ తదితరులు

మణికొండ, జూలై 4: ఆదర్శ మున్సిపాలిటీగా నార్సింగిని తీర్చిదిద్దేందుకు ప్రతిపౌరుడు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పర్యటనలో భాగంగా గురువారం 6వ వార్డులో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నిర్మాణంలో ఉన్న బాబూజగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక, పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు లోపిస్తున్నాయని తక్షణమే చర్యలు చేపట్టి పరిష్కరించాలని స్థానికులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలుంటాయని తక్షణమే చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నర్సింహ్మరాజు, కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ మణిహారిక, ఆర్ఐ అఖిల్, మేనేజర్ యోగేశ్ నాయక్, శానిటేషన్ సూపర్‌వైజర్ లచ్చిరాం, వార్డు అధికారి స్వామి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

జూబ్లీహిల్స్, జూలై 4: జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ 18వ సర్కిల్‌లో జలగం వెంగళరావునగర్ పార్కు, శ్రీనగర్‌కాలనీ పార్కుల్లో గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పార్కుల గుండా వెళ్తున్న నాలాల, డ్రైన్ల పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అన్నారు. పార్కుల్లో పరిశుభ్రమైన వాతావరణం కోసం పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. పార్కుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో సీనియర్ సిటిజన్స్, వాకర్స్ కోసం పాత్ వే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. స్థలం ఉన్నచోట పిల్లల కోసం చిల్డ్రన్స్ ప్లే ఏరియాతో పాటు ఆట వస్తువులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, యూబీడీ మేనేజర్ బాలయ్య, ఏఎంఓహెచ్ డాక్టర్ కె.రవి, ఇతర అన్ని విభాగాల అధికారులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఆధునిక చికిత్సతో న్యూరో సమస్యకు చెక్

ఖైరతాబాద్, జూలై 4: ఆధునిక చికిత్స విధానాలతో పిల్లల్లో న్యూరో సమస్యలను పరిష్కరించవచ్చని పలువురు పీడియాట్రిక్ నిమ్స్ న్యూరోసర్జన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సుచంద భట్టాచార్జి అన్నారు. నిమ్స్ ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ న్యూరో సర్జరీ ఆధ్వర్యంలో గురువారం పీడియాట్రిక్ న్యూరో సర్జరి అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. సొసైటీ చైర్మన్ డాక్టర్ అర్తుర్ కున్హా, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ సుచంద భట్టాచార్జి మాట్లాడుతూ పిల్లల్లో పుట్టుకతోనే మెదడు సంబంధిత రుగ్మతలు వస్తాయన్నారు. హైడ్రోసెఫలస్‌తో మెదడులో నీరు చేరుతుందని, కణతులు ఏర్పాడుతాయని, వెన్నుపాములో వచ్చే మైలోమెనింగోకోలే లాంటి సమస్యలు వస్తాయన్నారు. ఇలాంటి వాటికి అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమన్నారు. ఈ విభాగంలోని వైద్యులు ఇలాంటి చికిత్సల్లో సూక్ష్మ నైపుణ్యాలు, కొత్తగా వస్తున్న సాంకేతిక పురోగతిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో కిమ్స్ న్యూరోసర్జరీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ మానస్ పాణిగ్రహి, పీడియాట్రిక్ న్యూరో సర్జన్లు పాల్గొన్నారు.

నేటి నుంచి 'తెలుగు పద్మాలు' ధారావాహిక

జూబ్లీహిల్స్, జూలై 4: ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 75వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 'తెలుగు పద్మాలు' శీర్షికతో కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నది. ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలు అందుకున్న ప్రముఖుల పరిచయాలతో ధారావాహిక నేటి నుంచి ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి వినొచ్చని స్టేషన్ డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయ్ శంకర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీకి ఎంపికైన దీనా

దీనాను అభినందిస్తున్న కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, అనిల్ తయ్యప్ప

ఎర్రగడ్డ, జూలై 4: ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన దీనా రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీకి ఎంపికైంది. ఐదో తరగతి చదువుతున్న పదేండ్ల దీనా ఈనెల 7న జరిగే ఈ పోటీల్లో పాల్గొనబోతున్నది. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించింది. రాజీవ్‌నగర్ సమీపంలోని జీటీఎస్ మైదానంలో ఉచిత శిక్షణ శిబిరంలో దీనా తన శిక్షణను పూర్తి చేసుకున్న. కాగా గురువారం విద్యుత్ శాఖ అధికారి కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ అనిల్ తయ్యప్ప చిన్నారి దీనాను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పోటీలు పుల్లెల గోపీచంద్ అకాడమీలో జరుగుతాయని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతులు

హిమాయత్‌నగర్‌లోని వీధి నంబర్ 5లో మరమ్మతులు చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

హిమాయత్‌నగర్, జూలై 4: హిమాయత్‌నగర్ వీధి నంబర్-5లో రోడ్డు కుంగిపోవడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్న విషయాన్ని హిమాయత్‌నగర్ కార్పొ రేటర్ జి.మహాలక్ష్మి దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. దీంతో తక్షణమే ఆమె స్పందించి గుంతలు పడిన ప్రాంతానికి వెళ్లి పర్యవేక్షించారు. మరమ్మతులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించగా గురువారం దెబ్బతిన రోడ్లకు జీహెచ్ఎంసీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాంగ్రెస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

శంషాబాద్ రూరల్, జూలై 4: విద్యార్థులు అన్నిరంగాల్లో నైపుణ్యం సాధిస్తేనే సంపూర్ణాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సబ్బారావు అన్నారు. శంషాబాద్ మండలంలోని చెర్లగూడలోని ఐఎంటీ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మేంట్ టెక్నాలజీ) కళాశాలలో గురువారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దువ్వూరి సుబ్బారావు, సీఈవో క్యూరల్ టీక్యూ, డైరెక్టర్ అరబిందో ఫార్మా శాతకర్ణి హాజరై మాట్లాడారు. పరిశ్రమలు అంచనాలు అంశంపై చర్చించారు. కార్యక్రమంలో సింగపూర్ మార్కెటింగ్ ప్రొఫెసర్ మార్కస్ లియోన్‌హార్ట్, ఐఎంటీ పూర్వ విద్యార్థి అవిషేక్ మొహంత తదితరులు పాల్గొన్నారు.

చౌదర్‌గూడలో జోరుగా అక్రమ నిర్మాణాలు

చౌదర్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలో చేపడుతున్న భారీ ప్రహరీ నిర్మాణం

శంషాబాద్ రూరల్, జూలై 4: చౌదర్‌గూడలో స్థానిక అధికారుల అండదండలతో జోరుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. జీవో 111 నిబంధనలు పాటించకుండా పక్కనే ఉన్న బొల్లేవాణి చెరువుకు ప్రమాదం పొంచి ఉందని బీఆర్ఎస్ నాయకుడు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అక్రమ నిర్మాణాలపై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చౌదర్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 183లో 3 ఎకరాల 20 గుంటల భూమిలో ఎలాంటి నింబంధనలు పాటించక పోవడంతో పాటు భారీ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పై భాగంలోని వరద పూర్తిగా పక్కనే ఉన్న బొల్లేవాణి చెరువులోకి వెళ్తుంది. చెరువు పైభాగంలో భారీ ఎత్తున గోడ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు.

కేంద్రమంత్రి రాజీనామా చేయాలి

శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

శంషాబాద్ రూరల్, జూలై 4: నిట్ పేపర్ లీకేజీకి బాధ్యత మహిస్తు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలను బంద్ చేయించి నిరసన తెలిపారు. ప్రణయ్ మాట్లాడుతూ నిట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీలతో పరీక్షలను వాయిదా వేస్తుందన్నారు. తద్వారా నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎక్కడ చూసినా కుల, మతాల పేరుతో రాజకీయాలు చేస్తూ విద్యను పూర్తిగా మూలనపడేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ ఉపాధ్యాక్షు డు వర్ధన్, మణికంఠ, అభిలాష్, జగదీష్, అజయ్, సంధ్య, తరుణ్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

జూబ్లీహిల్స్: ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ పిలుపు మేరకు గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పాఠశాలల బంద్ కార్యక్రమాన్ని వివిధ విద్యార్థి సంఘాలు విజయవంతంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జోన్ కార్యదర్శి సునీల్, మనోజ్, వెంకట్, జిల్లా కమిటీ మెంబర్ కవిత, సచిన్, అంజి, కేశవులు, డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ, సీపీఎం నాయకులు టి.సాయిశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు

నీటి సమస్య లేకుండా చర్యలు

జూబ్లీహిల్స్, జూలై 4: రహ్మత్‌నగర్‌లో తాగునీటి సమస్యలు లేకుండా చూస్తామని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. గురువారం బంగారు మైసమ్మ టెంపుల్, బాబూఖాన్ గల్లీ నుంచి కార్మికనగర్ వరకు వేసిన నూతన పైప్‌లైన్‌ను పరిశీలించారు. రెండు రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంబశివరావు, తదితరులు

హిమాయత్‌నగర్, జూలై 4: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నాటి పోరాటమే తెలంగాణ ఉద్యమానికి నాంది పలికి, స్వరాష్ట్ర స్వప్నం సహాకారమైందన్నారు. కొమురయ్య 78 వర్ధంతి సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో కొమురయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటంలో కొమురయ్య కీలకపాత్ర వహించారన్నారు. సామాజిక న్యాయం, దోపిడీలేని సమసమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంతో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేశ్, రాష్ట్ర నాయకులు రత్నాకర్‌రావు, ఆర్.అంజయ్యానాయక్, కాంతయ్య, బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, లక్ష్మి, దామోదర్‌రెడ్డి, ఇ.ఉమామహేశ్, సబ్బు రాజమౌళి, ఆర్.కృష్ణ మూర్తి, సాయిల్‌గౌడ్, శంకర్, హరినాథ్ పాల్గొన్నారు.

కార్డన్ సర్చ్‌తో నేరాల అదుపు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 4: నేరాలను అదుపు చేసేందుకు కార్డన్ సర్చ్ ఉపయోగపడుతుందని మైలార్‌దేవ్‌పల్లి సీఐ పి.నరేందర్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి కార్డన్ సర్చ్ నిర్వహించారు. శాస్త్రీపురం, అక్బర్‌కాలనీ, ఒట్టేపల్లి, మహమ్మదీయాకాలనీ, ఒవైసీకాలనీ ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి ఇంటిని జల్లెడపట్టి గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా నిషేధిత గుట్కాలను తరలిస్తున్న ఓ ఆటోను పోలీసులు గుర్తించారు. ఆటోతో పాటు గుట్కాలను సీజ్ చేసి ఆటో డ్రైవర్ షేక్ మహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అర్ధరాత్రులు రోడ్లపై తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిపై స్పెషల్ ఫోకస్ పెట్టామని ఎవరైనా సేవించినా, తరలించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన పత్రాలు తప్పనిసరిగా అందుబాటులో పెట్టుకోవాలన్నారు. పోలీసులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తేవాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

నిషేధిత గుట్కా తరలిస్తున్న ఆటోను సీజ్ చేస్తున్న పోలీసులు

న్యూజెర్సీలో వడ్డేపల్లికి ఘన సత్కారం

జూబ్లీహిల్స్, జూలై 4: సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని 'ఎస్పీబీ ఇంటర్నేషనల్ మ్యూజిక్ అకాడమీ' న్యూ జెర్సీలోని రాయల్ ఆర్ట్ ప్యాలెస్‌లో స్మారక సంగీత సదస్సును ఘనంగా నిర్వహించింది. నిర్వాహకులు గూడూరు శ్రీనివాస్, గంటి భాస్కర్, మోపర్తి లక్ష్మి, దాముగేదెల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ సెనేట్ సభ్యుడు, కమిషనర్ చివుకుల ఉపేంద్ర, గౌరవ అతిథిగా ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ హాజరై బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఎస్పీ బాలు తన తొలి సినీ గీతాన్ని భానుమతి, ఏఎన్ఆర్ చిత్రంలో పాడి అశేష ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహాగాయకుడు అని అన్నారు. తన పరిశోధన గ్రంథం 'తెలుగులో లలిత గీతాలు' ప్రచురణకు సహకరించిన సౌజన్యశీలి అని కొనియాడారు. ఈ సందర్భంగా వడ్డేపల్లిని గనగోని శ్రీనివాస్, రాజేశ్వరి బుర్రా, ప్రవీణ్ గూడూరు సత్కరించారు.

పరిశుభ్రతపై అవగాహన

జూబ్లీహిల్స్, జూలై 4: ఇన్‌టెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్) వారోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరాంనగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. శ్రీరాంనగర్ ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యశ్రీ, వైద్య సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా చిన్నారులు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు విధిగా చేతులు కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మార్తమ్మ, ఏఎన్ఎంలు నాగవేణి, విజయ, తబుస్సుం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ హైస్కూల్‌లో అడ్మిషన్లు ఫుల్

ఖైరతాబాద్, జూలై 4: సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించగా, ఈ ఏడాది అడ్మిషన్ల కోసం విద్యార్థులు బారులు తీరారు. ప్రస్తుతం ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 450 ఉండగా, హైస్కూల్‌లో 120 మంది కొత్త విద్యార్థులు చేరారు. దీంతో మొత్తం సంఖ్య 620కి చేరింది.

చోరీకి యత్నం నిందితుడి అరెస్ట్

వెంగళరావునగర్, జూన్ 4: పాన్ షాప్‌లో చోరీకి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ వద్ద ఉన్న పాన్‌షాప్‌ను గురువారం తెల్లవారు జామున సుత్తితో పగులగొడ్తున్న వ్యక్తిని మధురానగర్ గస్తీ పోలీసులు గమనించి పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో దొంగతనానికి వచ్చినట్లు తెలింది. అతను జవహర్‌నగర్‌లో నివాసం ఉండే లక్ష్మణ్‌గా గుర్తించారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వారావుపేట సీఐపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, జూలై 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో విధులు నిర్వహిస్తున్న దళిత ఎస్సై శ్రీరాముల శ్రీను మానసికంగా వేధింపులకు గురిచేసిన సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుళ్ల ఎదుట అవమానించడం, వేధింపులు చేయడంవల్ల వాటిని భరించలేక మానసికంగా కృగిపోయిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారని, ఈ ఘటనకు బాధ్యుడైన సీఐ జితేందర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమో దు చేయాలన్నారు. పోలీస్ వ్యవస్థలో దళిత అధికారులపై వేధింపులు, వివక్షత పెరిగిందని ఆరోపించారు. ప్రాణాప్రాయస్థితిలో ఉన్న ఎస్సై శ్రీరాముల శ్రీనుకు మెరుగైన వైద్యం అందేలా పోలీస్ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.